సాక్షి
ములుగు

గురువారం । 1 । మే । 2025



పుష్కరాల పనుల్లో వేగం పెంచండి

ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాల పనుల్లో వేగం పెంచా లని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. -IIలో



విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

విద్యుత్ ప్రమాదాలను నివారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. -IIలో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.8⁰ /27.7⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.



ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల ప్రతిభ

గోవిందరావుపేట మండలం చల్వాయి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి దూడల కారుణ్య 577/600 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచారు. ములుగు మండలం జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి శ్రీపతి వర్షిత్ 575 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. బండారుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి బిజిగ అక్షయ్‌కుమార్ 572 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారు.

97.64 శాతం ఉత్తీర్ణత

'పది' ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాకు 8వ స్థానం

- గతంకంటే పెరిగిన ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి
- ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యార్థుల హవా



డి.కారుణ్య
577 మార్కులు



ఎస్.వర్షిత్
575 మార్కులు



బి.అక్షయ్‌కుమార్
572 మార్కులు

ములుగు: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. ఇందులో జిల్లా 97.64శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత 5స్థానాలు పైకి ఎగబాకింది. జిల్లాలో 3,134 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయగా 3,060 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 97.64గా ఉత్తీర్ణత శాతం నమోదు కాగా గతేడాది కంటే 3.19 శాతం అధికంగా ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 1,608 మంది బాలురు పరీక్ష రాయగా 1,560 మంది పాసై 97.01 శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,526 మంది బాలికలు పరీక్ష రాయగా 1,500 మంది పాసై 98.30శాతంగా ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. గత ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ బాలికలే టాప్‌గా నిలిచారు. ఫలితాలపై డీఈఓ పాణిని, డీసీఈబీ సెక్రటరీ సూర్యనారాయణ, ఏసీఈజీ అప్పని జయదేవ్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహ పడకుండా సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని ఏసీఈజీ అప్పని జయదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని సూచించారు. జూన్ 3వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని వివరించారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

ములుగు: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహన్‌తో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా తరఫున కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పరిధిలో అత్యధికంగా రైస్ మిల్లులు మిల్లింగ్ చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి, డీసీఓ సర్దార్‌సింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



సమీక్షలో మట్లాడుతున్న మంత్రి సీతక్క పక్కన కలెక్టర్ దివాకర, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో హనుమకొండ జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని పంపాలని అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్‌లో జిల్లా రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులను నిలిపి వేయాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని మంత్రి సీతక్క తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేశ్, సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి, డీసీఓ సర్దార్‌సింగ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉద్యోగులకు సహజం



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ శబరీశ్

ములుగు: ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజం అని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మారెడ్డి, పీసీఆర్ ఏఎస్సై రవీందర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఖాజామోయినుద్దీన్, ఏటూరునాగారం హెడ్ కానిస్టేబుల్ రామారావులు సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో నలుగురిని శాలువాలతో సన్మానించిన ఎస్పీ వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఎలాంటి సమస్య వచ్చినా సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటికైనా కుటుంబంతో ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆర్ఐ వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ములుగు: మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సాధు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సాధ్యమైనంత వరకు నూతన సొసైటీలను ఏర్పాటు చేయడంతో పాటు సభ్యులకు సభ్యత్వాలు ఇప్పిస్తానని తెలిపారు. సహకార సంఘాలకు నూతన భవనాల మంజూరుకు పాటు పడుతానని వెల్లడించారు. ప్రమాదవశాత్తు మరణించిన సభ్యుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించేలా చూస్తానని తెలిపారు. వచ్చే సీజన్‌లో సాధ్యమైనంత వరకు జులై, ఆగస్టు మాసాల్లో చేపపిల్లలను వదిలేలా తన వంతుగా చర్యలు తీసుకుంటానని వివరించారు.

ఈదురు గాలులు.. భారీ వర్షం

ములుగు: జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి తడిసిపోయింది. కొంత మంది రైతులు అందుబాటులో ఉండి టార్పాలిన్లు కప్పి ఉంచగా మిగతా రైతులు అచేతనంగా ఉండి పోయారు. తెల్లారితే గాని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం, కోతకు సిద్ధంగా ఉన్న వరి పరిస్థితులు తెలిసే అవకాశం ఉంది.

క్లుప్తంగా

వడదెబ్బతో వ్యక్తి మృతి

వెంకటాపురం(కె): మండలపరిధిలోని రాచపల్లి గ్రామంలో వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాచపల్లి గ్రామానికి చెందిన మాదరి వెంకన్న(55) అనే వ్యక్తి గొల్లగూడెం గ్రామంలో గేదెల కాపలదారుగా పని చేశాడు. ఈ మేరకు బుధవారం జీతం డబ్బులు తీసుకునేందుకు గొల్లగూడెం గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వడదెబ్బ తగిలి మొట్లగూడెం గ్రామసమీపంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వచ్చి చూడగా అప్పటికే వెంకన్న మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


రవి(ఫైల్)

వర్ధన్నపేట: ట్రాక్టర్ టైరు కిందపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని ఇల్లంద శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన ఇటికుల రవి (40) అదే గ్రామానికి చెందిన క రీం అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నా డు. ఈక్రమంలో బుధవారం వ్యవసాయ పను ల నిమిత్తం ఇల్లంద శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి గుంతలో పడటంతో డ్రైవర్ రవి ఎగిరి వెనకటైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమార్తె అక్ష య, కుమారుడు అఖిల్ ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

కేడీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రజనీలత

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రజనీలత బాధ్యతలను నిర్వర్తించనున్నారు. బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ జి. రాజారెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న రజనీలతకు చార్జీని అప్పగించారు. అధికారికంగా కళాశాల విద్యాకమిషనర్ త్వరలోనే కేడీసీ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా రజనీలతను నియమించనున్నట్లు సమాచారం.

ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం కొద్దిరోజుల పాటు ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కేయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వర్తించిన తోట రాజయ్య బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో రెగ్యులర్‌గా కేయూకు ఫైనాన్స్ ఆఫీసర్‌ను నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యూనివర్సిటీలో డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎవరైన డిప్యూటీ రిజిస్ట్రార్ ఉంటే ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించేవారు. ఉద్యోగ విరమణ పొందిన రాజయ్య కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకు ఫైనాన్స్ ఆఫీసర్ బాధ్యతల చార్జీని బుధవారం అప్పగించారు.

'అది ఫేక్.. స్పందించకండి'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి పేరు, ప్రొఫైల్ పిక్చర్‌తో సాయం కోరుతూ మెసేజ్‌లు వస్తే స్పందించవద్దని బుధవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రదం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవ్యవహారంపై కేయూ పోలీస్‌స్టేషన్‌లో, సైబర్ క్రైమ్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పుష్కరాల పనుల్లో వేగం పెంచండి

భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలి
- పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- సరస్వతి నది పుష్కరాల పనులపై అధికారులతో సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ, తదితరులు

కాళేశ్వరం: ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాల పనుల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలతో కలిసి పుష్కరాల పనులను పరిశీలించారు. ముందుగా త్రివేణిసంగమం వద్ద వీఐపీ (జ్ఞాన సరస్వతి) ఘాటు వద్ద నిర్మిస్తున్న సరస్వతి మాత విగ్రహం, ఘాటు విస్తరణ పనులు, మరుగుదొడ్లు, శ్రాద్ధమండపం నిర్మాణాలను పరిశీలించారు. మంత్రికి ఎస్పీ వీఐపీ ఘాటుకు వచ్చే రోడ్డు మ్యాపును వివరించారు. గోదావరిలో నీటిమట్టం పుష్కరాల నాటికి తగ్గుతుందా? అని ఇరిగేషన్‌శాఖ ఈఈ తిరుపతిరావును అడుగ్గా కొంత తగ్గుతుందని, అయితే భక్తులకు ఇబ్బంది లేదన్నారు. సరస్వతిమాత విగ్రహం బేస్ కింద రివిట్‌మెంట్ కరెక్ట్ ఉందా అని ఎండోమెంట్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. వీఐపీ ఘాటు వద్ద టెంట్‌సిటీ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇక్కడ టెంట్‌సిటీని మొదటిసారిగా ఏర్పాటు చేస్తున్నామని, జాయ్‌రైడ్స్ కోసం కన్నెపల్లి వద్ద కాకుండా దేవస్థానం లేదా ఘాటు పరిసరాల్లో మూడు హెలిపాడ్‌లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్‌కు తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

పుష్కరాలకు వచ్చే భక్తులకు అందంగా కనిపించాలని, వ్యర్థాలు, చెత్తచెదారం లేకుండా పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. పుష్కరాల్లో పారిశుద్ధ్యం పెద్దపీట వేస్తుందని, ఎక్కువ సంఖ్యలో కూలీలను పెంచాలన్నారు. అలాగే ప్రధాన ఘాటు నుంచి వీఐపీ ఘాటు వరకు గోదావరిలో బండరాళ్ల తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మళ్లీ పుష్కరాల పనులు పరిశీలించేందుకు నిత్యం వస్తుంటానని, అధికారులు అందుబాటులో ఉంటూ పనులు పూర్తి చేయించాలన్నారు. అలాగే గోదావరిలో బోట్లు తిప్పేందుకు అనుమతి ఇవ్వాలని, మరిన్ని బోట్లు పెంచి గంగపుత్రులకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం హరితహోటల్‌లో శాఖల వారీగా సమీక్ష చేశారు. మంత్రి వెంట సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఈఓ మహేష్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రామచందర్‌రావు, ఎస్సై తమాషారెడ్డి, నాయకులు కోట రాజబాపు, మాజీ ఎంపీపీ రాణిబాయి, అశోక్, శ్రీనివాసరెడ్డి, ఎల్.రాజబాపు, శకీల్, సత్యనారాయణ, జానీ, శ్యాందేవుడా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే నైతిక విలువలు

- తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్


వృషభవాహన సేవలో పాల్గొన్న బండా ప్రకాశ్, ముదిరాజ్ నాయకులు

హన్మకొండ కల్చరల్: ఆధ్యాత్మికతతోనే నైతిక విలువల పెంపొందుతాయని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు వర్ధనీపూజ, యాగశాల ప్రవేశం, భూతోత్సాదనం, యాగమండప స్నానపూజ, ద్వారతోరణపూజ, అగ్నిప్రతిష్ఠ, సర్వతోభద్ర, నవగ్రహ, వాస్తుయోగినీ చతుషష్ఠి భైరవ మండల పూజ, క్షేత్ర పాలక మండల దేవతా యజనం పూజ, చతుఃస్థానార్చన, భేరీపూజ జరిపారు. అమ్మవారిని పూలదండలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం వృషభవాహనంపై ఊరేగించారు. అనంతరం ధ్వజారోహణం చేశారు. అమ్మవారి సేవా కార్యక్రమాలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉభయదాతలుగా వ్యవహరించారు. బండా ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె అశోక్, మహానగర అధ్యక్షుడు బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, బండి సారంగపాణి, పొన్నం మొగిలి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి నుంచి రాష్ట్ర పద్మశాలి పురోహిత సంఘం అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, శ్రీవైలం, చెన్న కేశవులు అమ్మవారి కల్యాణం కోసం ప్రత్యేకంగా నేసిన పట్టుచీరను సమర్పించారు. సాయంత్రం మృగవాహనంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. బుధవారం అక్షయతృతీయ కావడంతో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి


విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలను నివారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం మే 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యుత్ భద్రతా వారోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీ సంవత్సరం మే మొదటి వారంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించడంతో పాటు సిబ్బందికి, ప్రజలకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతీ సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులకు, రైతులకు విద్యుత్ భద్రత ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఎస్ఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు తిరుమల్ రావు, రాజుచౌహాన్, అశోక్, బికంసింగ్, వెంకట రమణ, జాయింట్ సెక్రటరి కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

2న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 2న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-9, 11 బాలబాలికల విభాగంలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురంలోని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ కాటన్ ఇండస్ట్రీస్ భవనంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అండర్-9 విభాగంలో జనవరి 01, 2016 తర్వాత, అండర్-11 కేటగిరీలో పాల్గొనే క్రీడాకారులు జనవరి-01, 2014 తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. రెండు విభాగాల్లో గెలుపొందిన బాలుర నుంచి నలుగురు, బాలికల నుంచి నలుగురు క్రీడాకారులను మే చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె విరమణ


సమ్మె విరమింపజేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని 12 రోజులుగా సమ్మె చేస్తున్న కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం సమ్మె విరమించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం సమ్మె శిబిరం వద్దకు వచ్చి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రిటైర్డ్‌మెంట్ అయ్యే వరకు వారిని యథావిధిగా కొనసాగిస్తారని, డిస్టర్బ్ చేయరని, ఉద్యోగ భద్రత ఉంటుందని వీసీ ఆదేశాల మేరకు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మె విరమింపచేశారు. ఇందులో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కో-ఆర్డినేషన్ బాధ్యులు డాక్టర్ సాధురాజేశ్, శ్రీధర్‌కుమార్‌లోథ్, మాదాసి కనకయ్య, పి.కరుణాకర్‌రావు, ఆశీర్వాదం, భిక్షపతి, బి.సతీశ్, ఫిరోజ్‌పాషా, చంద్రోశేఖర్, జూల సత్య, అరూరి సూర్యం, సూర్యనారాయణ, రఘువర్ధన్‌రెడ్డి, చందులాల్, శ్రీదేవి, అనిల్, స్వప్న, సాహితి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- 10 మందిపై కేసు నమోదు


బాలు (ఫైల్)

కురవి: దారి విషయంలో జరిమానా విధించి, తిట్టి కొట్టి అవమానించడంతో ఓ వ్యక్తి మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీరోలు ఎస్సై నగేష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసంకీస శివారు బిల్యాతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ బాలు (53)కు అదే తండాకు చెందిన అతని బావ బానోత్ శంకర్‌ల మధ్య నడిచేదారి విషయమై ఏప్రిల్ 28న గొడవ జరిగింది. దీంతో ఈ విషయంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి బాలుకు రూ.25వేల జరిమానా విధించి అతిని బావ శంకర్‌కు ఇచ్చారు. దీంతో నా దగ్గర రూ.25వేలు తీసుకుంటావా? అని బావ శంకర్‌తో మళ్లీ గొడవ పడ్డాడు. ఈ సమయంలోనే కటారియా గోపిసింగ్, కిరణ్‌సింగ్, రాజేష్, వినోద్, బానోత్ మోహన్, వెంకన్న, రాజేష్, మోహన్, కమిలి, శంకర్ అందరూ కలిసి బాలును తిడుతూ, కాళ్లతో తన్ని అవమానపర్చారు. దీంతో బాలు అవమానం భరించలేక మనస్తాపంతో పొలం దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బాలు మృతికి కారణమైన పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.


గౌరవం పెరిగేలా పోలీసులు పనిచేయాలి

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్


కాజీపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

కాజీపేట/మడికొండ: ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరిగేలా పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. బుధవారం కాజీపేట, మడికొండ పోలీస్ స్టేషన్‌ను సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాల పనితీరు, కేసుల నమోదు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఏసీపీ తిరుమల్, సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు శివకృష్ణ, నవీన్ కుమార్, లవన్‌కుమార్, మడికొండ ఎస్‌హెచ్ఓ కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా-ఫాతిమానగర్‌లో వర్షబీభత్సం


రైల్వే ట్రాక్‌పై గాలికి కొట్టుకొచ్చిన ఇంటి రేకులు

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ – దర్గాలో బుధవారం కురిసిన గాలి, రాళ్ల వాన బీభత్సానికి పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అఫ్జల్‌నగర్, బస్తీ దవాఖాన ప్రాంతం, సర్వర్‌నగర్, బియాబానీ నగర్‌లో చెట్లు విరిగి నెలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. సర్వర్‌నగర్‌లో 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి, అఫ్జల్‌నగర్‌లో ఇంటి పైకప్పు రేకులు ఆకాశంలోకి లేచి రైలు పట్టాలపై పడ్డాయి. ఇళ్లపైనున్న వాటర్ ట్యాంకులు కిందపడ్డాయి. వర్షబీభత్సంతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దర్గా ప్రాంతంలో కరెంట్ లేదని మాజీ కార్పొరేటర్ ఎండి.అబుబక్కర్ తెలిపారు. సకాలంలో స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించినందుకు ఎమ్మెల్యే, మేయర్, విద్యుత్ మున్సిపల్ అధికారులకు మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

హసన్‌పర్తి: హనుమకొండ, అంబాల మార్గమధ్యలో ఎర్రగట్టు గుట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. పరకాల మండలం సీతానాగారానికి చెందిన శ్రీనివాస్, లలిత దంపతులు బుధవారం ద్విచక్ర వాహనంపై హనుమకొండ నుంచి అంబాల వైపునకు వెళ్తున్నారు. ఎర్రగట్టు గుట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రధాన రహదారిపై ఉన్న గేట్‌వాల్వ్ గుంతను ఢీకొన్నారు. దీంతో శ్రీనివాస్ దంపతులతో పాటు వారి రెండేళ్ల కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అయితే రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్ గుంత విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు.

టెన్త్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయభేరి


ఎస్.శివప్రియ దీక్షిత్‌రెడ్డి మనస్విని మనివర్ధన్ శివచరణ్ హాసిని

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షల ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. సక్కరా శివప్రియ 600 మార్కులకు గాను 586, డి.దీక్షిత్ రెడ్డి 586, ఎస్.మనస్విని 585, మనివర్ధన్ 584, శివ చరణ్ 584, వి.హాసిని 584 మార్కులు సాధించారని వారు తెలిపారు. 580కి పైగా మార్కులు 23మందికిపైగా సాధించి తమ ప్రతిభను చాటారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ ఒత్తిడి లేని వాతావరణంలో క్రమశిక్షణ, సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఎస్ఆర్ విద్యాసంస్థల్లో పోటీ పరీక్షలను ఎదుర్కొనే విధంగా ఎస్సెస్సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైమ్ స్కూల్స్‌ను ప్రారంభించామన్నారు.

'పది'లో షైన్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

హన్మకొండ: పదో తరగతి ఫలితాల్లో షైన్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ తెలిపారు. బుధవారం వెలుబడిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేల విద్యారంగంలో విశిష్ట సంస్థగా పేరొందిన షైన్ విద్యార్థులు జిల్లాకే తలమానికంగా నిలిచారన్నారు. షైన్ అంటే కేవలం 'ఐఐటీ'నే కాదని అన్నిరంగాల్లో ముందుంటామని మరోసారి రుజువు అయ్యిందన్నారు. జిల్లాలోనే తమ పాఠశాల విద్యార్థి బి.ఆదిత్య దీక్షిత్ 588 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. జి.జ్ఞానదీప్ 580, పి.హాసిని, మణికంఠ, రింషా జైనబ్ 579, సాయిశ్రీ 578, మణిచందన 577, కార్తీక, త్రిషిక పటేల్ 576, సంప్రీత్ 575, రాజేష్ 574 మార్కులు సాధించారన్నారు. 23 మంది విద్యార్థులు 570 మార్కులకు పైగా, 53 మంది 560 మార్కులకు పైగా, 92 మంది 550 మార్కులకు పైగా, 371 మంది 500 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. వరంగల్ మహానగరంతో పాటు రాష్ట్రస్థాయిలో షైన్ విద్యార్థులు ముందువరుసలో నిలిచారన్నారు. తెలుగులో 155 మంది, హిందీలు 90 మంది, ఇంగ్లిష్‌లో 299 మంది, గణితంలో 242 మంది, సైన్స్‌లో 217 మంది, సోషల్‌లో 154 మంది ఏ1 గ్రేడ్ సాధించారన్నా రు. డైరెక్టర్ పి.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ దే శంలోని ప్రతీ ప్రతిష్ఠాత్మక కళాశాలలో షైన్ విద్యార్థులున్నారని, దానికి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన కారణమన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగల రమ, ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్, షైన్ ఎర్రగట్టు గుట్ట చైర్మన్ జె.శ్రీనివాస్, ప్రి న్సిపాల్‌లు జి.రాజ్‌కుమార్, పి.విశాల్, ప్రగతి రెడ్డి, కవితా రాణి, ఉపాధ్యాయుల అభినందించారు.

మరోసారి సత్తా చాటిన 'తేజస్వి'



నయీంనగర్: ఎస్సెస్సీ పరీక్ష ఫలితాల్లో తేజస్వి పాఠశాల విద్యార్థులు గ్రేడ్ పాయింట్లతో పాటు మార్కుల్లో కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో విజయ దుందుభి మోగించినట్లు పాఠశాల చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి తెలిపారు. 590 మార్కులతో మేకల శ్రీనిత్య ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎ.సాయి సిరి 586 మార్కులు, బొల్లారపు గౌతమ్‌క్రిస్, పి.అహన్య 584, జి.రిషిక, కె.శ్రీనిధి 583, అయేషా తబుసమ్, పి.హృతిక్ రెడ్డి 581, పి.శృతిక, జి.పవన్ విదేష్, డి.సబరీష్ 580 మార్కులు సాధించారు. 579 నుంచి 570 మార్కుల వరకు 46 మంది, 569 నుంచి 560 మార్కుల వరకు 44 మంది, 559 నుంచి 550 మార్కుల వరకు 50మంది, 549 నుంచి 540 మార్కుల వరకు 61మంది విద్యార్థులు, 539 కంటే తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు 251 మందితో నయీంనగర్, పోచమ్మకుంట, ప్రశాంత్‌నగర్ బ్రాంచ్‌ల్లో జిల్లా స్థాయిలో అధిక మార్కులు సాధించినట్లు వివరించారు. విజయపరంపర కొనసాగించిన విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు పాఠశాలల ప్రిన్సిపాళ్లు పిల్లలమర్రి చంద్రశేఖర్, సంధ్య, జేపీ రావు, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

'ఎస్సెస్సీ'లో డిస్నీల్యాండ్ హవా


తుత్తురు హర్షిణి బానోతు శ్రీమాన్


దామెర: ఎస్సెస్సీ ఫలితాల్లో డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన తుత్తురు హర్షిణి, బానోతు శ్రీమాన్‌లు 569 మార్కులు సాధించారు. 47 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. 133 మంది విద్యార్థులకు గాను 130 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, బోధించిన ఉపాధ్యాయులను పాఠశాల ముఖ్యసలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, డైరెక్టర్లు రాకేష్‌భాను, దీనేష్‌చందర్‌లు అభినందనలు తెలిపారు.

శివాని విద్యాసంస్థల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

హసన్‌పర్తి: టెన్త్ పరీక్ష ఫలితాల్లో శివాని విద్యాసంస్థలు విశ్వరూపం ప్రదర్శించాయి. పాఠశాలకు చెందిన రుద్రోజు శ్రేష్ఠ 577 మార్కులు, దివిజా 569, శ్రీనిత్యా 553, అంచూరి మానస 551, కుంట మనోజ్ 546, భూపతి అశ్వితారెడ్డి 545, శస్త్ర రాఘశ్రీ 543, పెద్దిరెడ్డి మణిదీప్ రెడ్డి 539, ప్రణవ్ 539, దీవన్‌కుమార్ 538 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్ టి.స్వామి, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, రాజు, ఎన్.రమేష్, మురళీధర్, వి.సురేష్, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

డీలక్స్ బస్ చార్జీలపై 10శాతం తగ్గింపు



హన్మకొండ: వరంగల్- నిజామాబాద్ రూట్‌లో డీలక్స్ బస్ చార్జీలపై 10 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. తగ్గింపు చార్జీలను మే 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో మెరుగైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.



నిర్వహణ: నిర్మలా రెడ్డి

సాక్షి ఫ్యామిలీ IV
వరంగల్
గురువారం ॥ 1-5-2025

వయసుల వారీగా డైట్ చక్ర

టీనేజ్, యవ్వనం, గర్భధారణ, పిల్లలకు పాలు ఇవ్వడం, మెనోపాజ్, వయసు పైబడటం.. వంటి దశల ఆధారంగా పోషక అవసరాలు మారుతుంటాయి. కానీ, మన ఇళ్లలో సాధారణంగా అందరికీ ఒకేతరహా వంటను వండుతుంటాం. దీనివల్ల వయసుల వారీగా సరైన పోషకాలు శరీరానికి అందక, శక్తి సన్నగిల్లుతుంది. దీంతో చురుకుదనం తగ్గుతుంది. ఫలితం చేసే పనులపై ప్రభావం చూపుతుంది. అందుకని పోషకాహార చక్రం ఎవరికి వారు, వయసుల వారీగా ఆరోగ్యదాయకంగా మార్చుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి.



రోజూ ఉదయం నుంచి వంటింట్లో చెమటలు కక్కుతూ వంటకాలతో కుస్తీ పడుతుంటుంది అమ్మ. 'నీరసంగా ఉంటోంది.. ఏ పనీ చేయాలనిపించడం లేదు' అని అంటూనే లేని ఓపికను తెచ్చుకొని పనులు చేస్తూనే ఉంటుంది. 'కాళ్ల నొప్పులు.. కదలనివ్వడం లేదు' అంటూ కూర్చున్న చోటు నుంచి లేవలేకపోతుంటుంది బామ్మ. కాలేజీ నుంచి వస్తూనే 'బ్యాగ్ కూడా మోయలేను.. అలసటగా ఉంది' అంటూ సోఫాలో కూలబడిపోతుంది కూతురు. రోజూ మూడుపూటలా తింటూనే ఉన్నాం, అయినా ఎందుకిలా?! ఏ ఆరోగ్య సమస్యనో అని వైద్యులను కలిస్తే 'పోషకాహారం తీసుకోండి' అని చెబుతుంటారు. మన శరీరానికి ఏయే పోషకాలు అవసరం, సీజన్‌కి తగినట్టు మన ఆహారపు అలవాట్లను ఎలా మార్చుకోవాలి. సింపుల్‌గా హెల్తీ వంటకాలను ఎలా తయారు చేసుకోవచ్చు... ఈ వివరాలతో వరుస కథనాలు

1 బాల్యం నుంచి యవ్వనం (8-18 ఏళ్లు) వరకు

శరీరం వృద్ధి చెందడానికి, హార్మోన్ల సమతుల్యతకు, ఎముకల బలానికి ... పాల ఉత్పత్తులు, బాదం, ఆకుకూరలు, గుడ్లు, పప్పులు, మటన్, చికెన్, బచ్చలి, బ్రోకోలి, బీట్‌రూట్.. మొదలైన ఐరన్ నిచ్చే పదార్థాలు ఈ వయసుకు కీలకం.

బ్రేక్‌ఫాస్ట్: ఉప్మా/పొంగల్/ ఇడ్లీ.. + ఒక గుడ్డు + గ్లాస్ పాలు
మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్/ రోటీ (2)+ పప్పు, ఆకుకూర, బీన్స్, పెరుగు
సాయంత్రం స్నాక్స్: బాదం/జీడిపప్పు/ఇతర డ్రై ఫ్రూట్స్‌తో చేసిన స్నాక్స్ (చిన్న మోతాదులో)+ అరటి పండు
రాత్రి భోజనం: రోటీ (2) లేదా మినప పిండితో చేసిన అట్టు +ఏదైనా కూరగాయ + నిమ్మరసం కలిపిన వెజ్ సలాడ్



2 యువతులకు (19-30 ఏళ్లు)

రుతుక్రమం చురుకుగా ఉండటం, సంతానోత్పత్తి ప్లానింగ్‌కి సరైన సమయం. ఈ దశలో...
ఐరన్ – ఫోలేట్ సమృద్ధిగా లభించే ఆకుకూరలు, అరటి మొదలైనవి తినాలి. ఒమేగా-3 యాసిడ్స్ ఉండే ఫ్లాక్స్ సీడ్స్, చేపలు, వాల్‌నట్స్‌ను కూడా చేర్చుకోవాలి.. పీచుపదార్థాలు ఉండే గోధుమ, కూరగాయలు, జామ వంటి పండ్లు తినాలి. కాల్షియం కోసం పాలు, పెరుగు, టోఫు వంటివి తీసుకోవాలి. జింక్ సమృద్ధిగా లభించే చిక్కుళ్లు లాంటివి.. ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

3 గర్భధారణ సమయంలో...

పిండం అభివృద్ధికి, తల్లి శక్తికి తీసుకోవాల్సినవి...
డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ + ఆకుకూరలు, నువ్వులు, దాల్చిన చెక్క, ప్రొటీన్ల కోసం గుడ్లు, పప్పులు, చికెన్, కాల్షియం – విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, ఫైబర్‌కి పండ్లు, బ్రౌన్ రైస్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌కి చేపలు, ఫ్లాక్స్ సీడ్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: గోధుమ రవ్వ/ ఓట్స్ ఉప్మా+ అరటి పండు + గ్లాసుడు పాలు
లంచ్: బ్రౌన్ రైస్ /రోటీ (2) / మెంతికూర పప్పు/ పెసరపప్పు+ బెండకాయ కూర, పెరుగు + కారట్/కీరా సలాడ్
సాయంత్రం స్నాక్స్: బాదం/వాల్‌నట్ (4 -5) +అరటిపండు / సపోటా
డిన్నర్: రొట్టెలు (2) / మినప దోస, బీన్స్ / సొరకాయ కూర + గ్లాస్ మజ్జిగ.

అ... అమ్మ ఆ... ఆహారం



మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించి సమతులాహారం తీసుకోవడంలో జాగ్రత్తలు పెరిగాయి. కానీ, మన రొటీన్ ఫుడ్ మాత్రం అలాగే ఉంటోంది. హార్మోన్ల సమతుల్యతకు, శక్తికి తినే ఆహారం చాలా ముఖ్యమైనది. సాధారణంగా మహిళలు తీసుకునే ఆహారంలో ఉండాల్సినవి ఐరన్, కాల్షియం, విటమిన్లు, ప్రొటీన్లు.

శక్తికి ఇనుము... రక్తంలో ఐరన్ శాతం తగ్గితే బలహీనం అవుతారు. త్వరగా అలసిపోతారు. రక్తస్రావం అధికం అవుతుంది. తలనొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. బచ్చలి, పాలకూర, తోటకూర. గోంగూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, చిక్కుళ్ళు, శెనగ, మటన్, పెసలు, నట్స్, ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, తృణధాన్యాలు, గుడ్లు.. వంటివి శరీరంలో ఐరన్ శాతం పెరగడానికి సహాయపడతాయి. ఒక వ్యక్తి రోజువారీగా అవసరమైన ఐరన్ మోతాదు వారి వయసు, జెండర్‌పై ఆధారపడి ఉంటుంది. గర్భిణులు, బాలికలకు రోజూ 18 మిల్లీగ్రాముల ఐరన్ అవసరం. దీంతో పాటు విటమిన్ – సి ఉండే నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లు, రసాలు తీసుకోవడం వల్ల ఒంట్లో ఇనుము శోషణ పెరుగుతుంది.

పాల ఉత్పత్తులతో కాల్షియం...
ఎముకల బలానికి,,, ప్రత్యేకంగా మెనోపాజ్ దశలో కాల్షియం అవసరం అధికం. అందుకు పాల ఉత్పత్తులు, బాదం, శనగలు, కాలీఫ్లవర్ .. వంటివి తినాలి. ● గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో ఫోలిక్ యాసిడ్ అవసరం ఎక్కువ. ఆకుకూరలు, మాంసం, దాల్చిన చెక్క.. వంటి వాటి నుంచి ఫోలిక్ యాసిడ్ లభిస్తుంది ● ఒమేగా–3 ఫ్యాటి యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హార్మోన్ల సమతుల్యతకు ఉపయోగ పడతాయి. ఫ్లాక్స్ సీడ్స్, వాల్ నట్స్, చేపల నుంచి ఈ ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి ● శరీర బలానికి, కండరాల పెంపుకు ప్రొటీన్లు చాలా అవసరం. మినపపప్పు, చికెన్, గుడ్లు, నట్స్... నుంచి ప్రొటీన్లు లభిస్తాయి ● జీర్ణ వ్యవస్థ సజావుగా పనిచేయడానికి ఫైబర్ చాలా అవసరం. గోధుమ, మొక్కజొన్న, పండ్లు, కూరగాయల నుంచి లభిస్తుంది.





- డా.బి. జానకి
పోషకాహార నిపుణులు



4 పాలిచ్చే తల్లులు

తగినంత శక్తిని తిరిగి పొందడానికి, పాల వృద్ధికి తీసుకోవాల్సినవి.. ఆకుకూరలు, బ్రోకలీ, కాలీఫ్లవర్, పండ్లు, లేత మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్ తల్లులకు ప్రొటీన్ అందిస్తాయి. పాల ఉత్పత్తులు, నువ్వులు, ఆహారం జీర్ణం అవడానికి పల్చని మజ్జిగ మొదలైనవి తీసుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: పెసరట్లు, అల్లం పచ్చడి+గ్లాసుడు పాలు/రాగి జావ
లంచ్: బ్రౌన్ రైస్+ మటన్/ చికెన్‌కర్రీ, మెంతికూర పప్పు, పెరుగు, గోంగూర పచ్చడి. **సాయంత్రం స్నాక్స్:** జీరా రసం + బాదం/మెంతి లడ్డు, ఏదైనా ఒక పండు. **డిన్నర్:** రోటీ (2)/మినప రొట్టె, పల్లీలు, బచ్చలి కూర రాత్రి పడుకునే ముందు (ఒంటిగంట లోపల) గ్లాస్ నీళ్ల లేదా చిటికెడు పసుపు కలిపిన గోరువెచ్చని పాలు. బాగా ఆకలిగా అనిపిస్తే అర టేబుల్ స్పూన్ గుమ్మడికాయ గింజలు.

5 మెనోపాజ్ దశ

45 ఏళ్లు పైబడిన మహిళలు ప్లాన్ చేసుకోదగిన పోషకాహారంలో హార్మోన్ల సమతుల్యత, ఎముకల బలం, కొలెస్ట్రాల్ నియంత్రణ పై దృష్టి పెట్టాలి. కాల్షియం – విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, సోయా, టోఫు వంటివి తీసుకోవాలి. చేపలు, ఫ్లాక్స్ సీడ్స్, పీచుపదార్థాలు ఉండే కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే బెర్రీస్, నాటు, తాటి బెల్లం, గ్రీన్ టీలను చేర్చుకొని చక్కెర, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి... **బ్రేక్‌ఫాస్ట్: (ఉదయం 8:00 - 9:00):** ఓట్స్ + పాలు + కొద్దిగా వాల్‌నట్ లేదా బాదం (లేదా) రాగి దోస + పెసరపప్పు చట్నీ, ఒక అరటి పండు + గ్లాస్ నీరు. **మధ్యాహ్న భోజనం (లంచ్ - 1:00):** బ్రౌన్ రైస్ లేదా గోధుమ/జొన్న/సజ్జ రొట్టెలు, ఆకుకూరల పప్పు (గోంగూర, తోటకూర వంటివి), దుంపలు కాకుండా దొండకాయ/బీన్స్/బెండకాయ, సలాడ్ (కీరా, గాజర్), పెరుగు. **సాయంత్రం స్నాక్స్ (5:30 - 6:00):** గ్రీన్ టీ లేదా తులసి టీ (షుగర్ లేకుండా) నట్స్ (బాదం, నువ్వులు లేదా ఫ్లాక్స్‌సీడ్స్) (లేదా) ఆపిల్ / పియర్ / సపోటా **రాత్రి భోజనం (డిన్నర్ - 7:30 - 8:00):** గోధుమ రొట్టె (1-2). వెజిటబుల్ సూప్ లేదా తేలికగా జీర్ణం అయ్యే కూర (బెండకాయ, సొరకాయ వంటివి), మజ్జిగ (ఉప్పు తక్కువతో) తీసుకోవాలి.

సమతుల్యత అవసరం

ఓవర్ ఈటింగ్/ తక్కువ తినడం రెండూ సమస్యలు తెచ్చిపెట్టేవే. వ్యక్తి శరీర బరువు, శ్రమను బట్టి డైట్ ప్లాన్ చేసుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి. ప్రతి వ్యక్తికి వారి శరీర బరువు, జీవనశైలి, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా డైట్ చార్ట్ ప్లాన్ చేసుకోవాలి. **ఉదాహరణ:** 50 ఏళ్ల మహిళ డైట్ చార్ట్. ● సమతుల్యత, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉండేటట్లు డైట్ ప్లాన్ చేయాలి. **ప్రత్యేక సూచనలు:** ● రోజూ కనీసం 7,000 – 8,000 అడుగులు నడవాలి / యోగా / లైట్ స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఉప్పు, స్వీట్స్ తక్కువగా వాడాలి ● మెనోపాజ్ దశ కాబట్టి కాల్షియం, విటమిన్–ఇ విషయంలోప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తప్పనిసరి. 15 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి నేరుగా తాకేలా చూసుకోవాలి.

పిల్లలకు చెప్పాల్సిన మాయాబజార్ పాఠాలు




'మీరు ఉద్దండ పండితులేగాని ఉండాల్సిన బుద్ధి మాత్రం లేదయ్యా' అంటాడు శకుని.
ర్యాంకులు వేరు... కామన్‌సెన్స్ వేరు...
ఈ సంగతి పిల్లలకు ఎవరు చెప్పాలి?
'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉండనే ఉంది' అంటాడు ఇదే శకుని.
ఈ చిట్కా చెప్పడానికి పెద్దలకు తీరిక ఎక్కడిది?
అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో తెలుసుకోకపోతే పిల్లల అడుగులు పడేదెలా?
హాయ్ హాయ్ నాయకా.. హోయ్ హోయ్ నాయకా...
నాయకత్వ లక్షణాలు ఎవరికి ఉంటాయి?
తెలుగువారికి మాత్రమే ఉన్న వ్యక్తిత్వ వికాస సర్వస్వం 'మాయాబజార్' సినిమా.
ఈ సెలవుల్లో పెద్దలు పిల్లలతో ఈ సినిమా చూడాలి. వివరించాలి.



'మాయాబజార్' 1957లో విడుదలైన గొప్ప తెలుగు చిత్రం. భారతంలోని పాత్రలకు కొద్దిపాటి కల్పన జత చేసి మలచిన ఈ సినిమా ఎందుకు ఇంతకాలం ఆదరణ పొందుతూ ఉందంటే అది ఎప్పుడూ ఒకేలా ఉండే మానవ స్వభావాలను చిత్రించింది కనుక. నేడు ఎదురుపడే మనుషులు ఎలా ఉంటారో ఈ సినిమాలో పాత్రలు అలా ఉంటాయి. అందుకే వాటితో తమను తాము ఐడెంటిఫై చేసుకున్న ప్రేక్షకులు ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు. అర్థం చేసుకుంటారు. పిల్లలకు ఈ సినిమా గొప్ప వినోదంగా ప్రారంభమవుతుంది. ఐదేళ్ల వయసు పిల్లల నుంచి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. చూసేకొద్దీ ఎదిగే కొద్దీ వారికి సినిమా కొత్తగా అర్థమై మరింతగా నచ్చుతుంది. ఈ సినిమాకు ఫ్యాన్స్ అయిపోతారు. అలా తరతరాలుగా ఫ్యాన్స్ అయ్యేలా చేసుకుందీ సినిమా. గతంలో ప్రతి వేసవిలో ఈ సినిమా రీరిలీజ్ అయ్యేది. ఇప్పుడు ఓటీటీల్లో... యూట్యూబ్‌లో కలర్‌లో ఉంది. పిల్లలతో ఒకటికి రెండుసార్లు చూసి వారికి చెప్పాల్సిన పాఠాలు చాలానే ఉంటాయి.

1. బాల అభిమన్యు తన విలువిద్య గురించి ఇలా అంటాడు: అత్తయ్యా... నువ్వు జడవకుండా నుంచో... నీ ముక్కుకు తగలకుండా నత్తును కొడతాను.
పిల్లలకు చెప్పాలి: నత్తు అంటే ముక్కుకు పెట్టుకునే ఆభరణం. విలువిద్య నేర్చుకుని ఎవరైనా సరే పండునో కాయనో కొట్టగలరు... కాని ముక్కుకు తగలకుండా నత్తును కొడతానంటున్నాడంటే విలువిద్య చాలా గొప్పగా నేర్చుకున్నాడన్న మాట. మనం చదివినా, ఆటల్లో ప్రవేశించినా, కళల్లో ఉన్నా ఆ స్థాయి పరిణితి సాధించాలి. అభిమన్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

2. శ్రీకృష్ణుడు 'సత్యపీఠం' తీసుకువస్తాడు. అలాగే 'ప్రియదర్శిని' కూడా చూపిస్తాడు.
పిల్లలకు చెప్పాలి 'సత్యపీఠం' ఆనాటి లై డిటెక్టర్. మన పూర్వీకులు శాస్త్ర పరంగా గొప్ప ప్రయోగాలు చేశారు. ఊహలు చేశారు. శాస్త్రజ్ఞుల ఊహలో లేని కాలంలో 'సత్యపీఠం' ఊహ చేయడం మనవారి గొప్పతనం. అలాగే వీడియో కాల్ చేసుకునేలా ల్యాప్‌టాప్ లాంటి 'ప్రియదర్శిని'ని చూపించారు. సైన్స్ దృష్టి కోణం నుంచి పురాణాలు చూస్తే చాలా ఇంటెరెస్టింగ్ విషయాలు తెలుస్తాయని చెప్పాలి.



3. శకుని పాచికలు వేస్తూ అంటాడు: ఈ పాచికలతో ఎవరినైనా సర్వనాశనం చేయగలను.
పిల్లలకు చెప్పాలి: జూదం వ్యసనం. అందులో మోసం ఉంటుంది. నష్టం ఉంటుంది. ఒక్కసారి వ్యసనాల్లో దిగితే తిరిగి రావడం కష్టం. నేటి రోజుల్లో ఆన్‌లైన్ గేమింగ్ కూడా అలాంటి వ్యసనమే. బెట్టింగ్ యాప్‌లు కూడా వ్యసనమే. ఆల్కహాల్, డ్రగ్స్ కూడా వ్యసనాలే. వ్యసనాల వల్ల పాండవులు రాజ్యాలను కోల్పోయారు. అందువల్ల ఎప్పుడూ వ్యసనాల జోలికి పోకూడదు.

4. శర్మ, శాస్త్రి వచ్చి లక్ష్మణ కుమారుణ్ణి పొగుడుతూ 'పురోగమించుట వారికి తెలుసు... తిరోగమించుట తమకు తెలుసు' అంటారు.
పిల్లలకు చెప్పాలి: గొప్పలు చెప్పుకోవడం, పొగడ్తలకు పడిపోవడం అల్పుల లక్షణం అని, లక్ష్మణ కుమారుడు అలాంటి వాడని చెప్పాలి. మనకు ఎంత ప్రతిభ ఉన్నా గొప్పలు చెప్పుకోకూడదని నేర్పాలి. లేని ప్రతిభ ఉన్నట్టుగా కల్పించి చెప్పి అభాసుపాలు కాకూడదని చెప్పాలి. మన బలహీనతను వాడుకుంటూ కొందరు చుట్టూ చేరి మోసం చేసి పబ్బం గడుపుతారనీ అలాంటి వారిని గుర్తించి దూరం ఉండాలి చెప్పాలి.

5. రాజ్యం పోయాక సుభద్ర వస్తే బలరాముని ఇంట్లో పరాభవం
పిల్లలకు చెప్పాలి: కొందరు మనుషులు అభిమానాన్ని బట్టి గాక స్థితిని బట్టి గౌరవిస్తారని, మనం కష్టంలో ఉంటే వారు అసలు రూపు చూపిస్తారని అలాంటి వారిని చూసి జాలి పడాలి తప్ప బాధ పడకూడదని నేర్పాలి. డబ్బుకు అతీతమైన విద్యాబుద్ధులు, వ్యక్తిత్వం శాశ్వతమని, వాటికే లోకంలో విలువ, గౌరవం అని చెప్పాలి.

6. ఘటోత్కచుడి ప్రవేశం
పిల్లలకు చెప్పాలి: మన దేశంలో అడవుల్లో జీవించేవారు ఉంటారని వారిని గిరిజనులు, ఆదివాసీలు అంటారనీ వారి కట్టు, బొట్టు, భాష, యాస, ఆచారాలు వేరని... మనం నాగరికులం అయినంత మాత్రాన వారిని చిన్నచూపు చూడకూడదని. వారెంతో మంచివారని, అడవులు వారి ఆధారం అని వాటిని నరికి లాక్కుని వారికి హాని కలిగించడం తప్పు అని నేర్పాలి. 'అస్మదీయులు' అంటే ఫ్రెండ్స్ అనీ, ఆదివాసీలకు మనం అస్మదీయులుగా ఉండాలని చెప్పాలి.

7. దుష్ట చతుష్టయం
పిల్లలకు చెప్పాలి: దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు... వీరు నలుగురిని దుష్ట చతుష్టయం అంటారని చతుష్టయం అంటే నాలుగు అని చెప్పాలి. చెడు ఆలోచనలు చేసేవారితో స్నేహం చేస్తే మనం కూడా చెడ్డవాళ్లం అవుతామని చెడ్డపనులు చేయడం వల్ల ప్రమాదంలో పడతామని హెచ్చరించాలి.

8. గింబళి, గిల్పం కావాలని డిమాండ్
పిల్లలకు చెప్పాలి: స్నేహితులైనా, బంధువులైనా న్యాయమైన సాయం, కోరిక కోరితే నెరవేర్చాలని, అదే మన మంచితనం సాకుగా తీసుకుని గొంతెమ్మ కోరికలు కోరితే వారికి బుద్ధి చెప్పాలని నేర్పాలి. 'కంబళి', 'తల్పం' కాదని 'గింబళి', 'గిల్పం' కోరిన శర్మ, శాస్త్రులకు చిన్నమయ్య బుద్ధి చెప్పే దృశ్యాలు పిల్లలకు ఎంతగానో నవ్వు తెప్పిస్తాయి.

9. శాకంబరీదేవి ప్రసాదం- వివాహ భోజనంబు
పిల్లలకు చెప్పాలి: తెలుగువారి భోజనానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రతి ప్రాంతానికీ సమూహాలకు వారివైన ఆహార అలవాట్లు ఉంటాయని, వాటిని గౌరవించాలని మన ఆహారపు అలవాట్లను పాటించాలని నేర్పించాలి. గోంగూరను శాకంబరీ దేవి ప్రసాదం అంటారని తెలుగువారికి గోంగూర ఇష్టమని చెప్పాలి. భక్ష్యాలు, చిత్రాన్నాలు, పానీయాలు, కూరగాయలు అంటే ఏమిటో వాటి తేడాలేమిటో చెప్తే సరదా పడతారు.

10. చినమాయను పెనుమాయ
పిల్లలకు చెప్పాలి: ఏ పనైనా నిజాయితీగా చేస్తే ఫలితం ఉంటుందని.. మాయతో కపటంతో శశిరేఖను లక్ష్మణ కుమారుడికి ఇచ్చి పెళ్లి చేయాలని కౌరవులు భావిస్తే శ్రీకృష్ణుడు, ఘటోత్కచుడు పెనుమాయతో ఆ పెళ్లిని పెటాకులు చేశారని... తగిన శాస్తి జరిగిందని... చెడ్డవాళ్లు ఎప్పటికీ ఓడిపోతారని, మంచితనంతో ఉంటేనే గెలుస్తామని బోధించాలి.

కె.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

శ్రమైక జీవనం



కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు... ఒంటి చేత్తో తోసిరాజని....

పనిలో తమను తాము నిరూపించుకున్నారు మహిళా కార్మికులు.

కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణగా నవీన శక్తిలా ముందుకు వచ్చారు మహిళా కార్మికులు.

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతిబింబం అయ్యారు.

'ఈ రంగంలో మహిళలు పనిచేయలేరు' అనుకునే రంగాలలోకి వచ్చి అపోహలను బద్దలు కొట్టారు.

'పురుషులకు ఎక్కడా తీసిపోము' అని నిరూపించారు. నిరూపిస్తూనే ఉన్నారు. అయితే... ఇది నాణేనికి ఒక కోణం మాత్రమే. మరో కోణంలో చూస్తే మహిళా ఉద్యోగులు, కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య మన దేశంలో ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన చర్చను ముందుకు తెచ్చింది. వివిధ సర్వేల ప్రకారం మూడింట ఒకవంతు మంది మహిళలు పని ప్రాంతంలో ఏదో ఒక రకమైన శారీరక హింసను ఎదుర్కొంటున్నారు.

మహిళా సిబ్బందికి వారి పని ప్రాంతంలో ప్రమాదాలు పెరిగాయి. చాలా ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా లేదు. సరైన నిఘా, రిపోర్టింగ్ యంత్రాంగం లేకపోవడంతో అనుచిత ప్రవర్తన, వేధింపులు పెరిగాయి. ప్రాథమిక భద్రతా చర్యల గురించి చాలా సంస్థలలో మహిళా ఉద్యోగులకు అవగాహన కలిగించడం లేదు.

గార్మెంట్ ఫ్యాక్టరీలలో ఎక్కువమంది కార్మికులు మహిళలే. అయితే పురుషులతో పోల్చితే వారికి తక్కువ వేతనం ఇస్తున్నారు. వేతన అసమానతలతో పాటు పనిప్రాంతంలో ప్రమాదాలు, పురుషాధిపత్య వేధింపులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలలో మహిళాకార్మికులకు మౌలిక సదుపాయాల కొరత ఉంది.

'బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్' రిపోర్ట్ మన దేశంలో గార్మెంట్ ఫ్యాక్టరీలలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. నిజానికి 'ఇది కేవలం గార్మెంట్ పరిశ్రమలకు సంబంధించిన రిపోర్ట్ మాత్రమే' అనుకోనక్కర్లేదు. చిన్నా, పెద్ద తేడాలతో ఎన్నో పరిశ్రమలలో వేరు వేరు రూపాల్లో ఇదే పరిస్థితి ఉంది.

కోవిడ్ మహమ్మారి ఉమెన్ హెల్త్ వర్కర్‌లకు ప్రమాదాలు తెచ్చింది. విధి నిర్వహణలో చనిపోయిన వారు కూడా ఉన్నారు. అయినా వెనక్కి తగ్గలేదు.

నిరాశ పడే పరిస్థితులు రావచ్చు, భద్రతాపరమైన సమస్యలు ఉండవచ్చు....ఒకటి, రెండు అని కాదు....సవాలక్ష సమస్యలు ఎదురైనా మహిళా శ్రామిక శక్తి వెనక్కి తగ్గడం లేదు.

ఎందుకంటే వారు...

చరిత్ర వింటూ వచ్చారు. మరో చరిత్ర నిర్మించాలనుకుంటున్నారు.